క్లుప్తంగా

టైప్ రైటింగ్ అర్హతలపై మంత్రికి వినతి


మంత్రి దుర్గేష్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రతినిధులు

సీటీఆర్ఐ: తమిళనాడు తరహాలోనే టైప్ రైటింగ్ లోయర్, హయ్యర్ గ్రేడ్ అర్హతలను ఇక్కడ రాష్ట్రంలో అమలు చేయాలని రాష్ట్ర పర్యాటక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్‌కు ఏపీ టైప్ రైటింగ్ అండ్ షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ (ఏపీటీఎస్ఐఏ) విజ్ఞప్తి చేసింది. మంగళవారం గోదావరి ట్విన్ ఆర్ట్స్ అసోసియేషన్ కార్యదర్శి టి.శ్రీనివాస్, ఏపీటీఎస్ఐఏ ప్రధాన కార్యదర్శి ఏజేకే మూర్తి, రీజనల్ కార్యదర్శి ముళ్ల వెంకటేశ్వరరావు, డీఎంపీ ప్రసాద్ స్థానిక మంత్రి కార్యాలయంలో ఆయనను కలుసుకుని ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సమస్యను ఐటీ మంత్రి దృష్టికి తీసుకెళతానని మంత్రి హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ వ్యవస్థాపక సభ్యులు ఆర్‌పీ ప్రసన్నకుమార్, బీవై మధుమాదవరావు, అధ్యక్షుడు బీవై రాజు తదితరులు ఉన్నారు.

ఎల్ఐసీ అభివృద్ధిలో ఉద్యోగులే కీలకం


ఎస్‌డీఎం సంధ్యారాణికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసీ) అభివృద్ధికి ఉద్యోగులు ఎల్లప్పుడూ ముందుంటారని, పాలసీదారుల ప్రయోజనాలు కాపాడటంలో సంస్థ అగ్రగామిగా ఉందని అఖిల భారత బీమా ఉద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డా.గుబ్బల రాంబాబు, ఎం.కోదండరామ్ అన్నారు. మంగళవారం సంఘ 74వ ఆవిర్భావ దినోత్సవాన్ని మోరంపూడిలోని ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డా.గుబ్బల రాంబాబు సంఘ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎల్ఐసీలో 80 శాతానికి పైగా సభ్యత్వం ఉన్న తమ సంఘానికి వెంటనే గుర్తింపు ఇవ్వాలని, నాలుగేళ్లుగా ఖాళీగా ఉన్న 2,700 క్లాస్–3, 4 ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరుతూ రాజమండ్రి డివిజన్ ఎస్‌డీఎం కె.సంధ్యారాణికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు ఈశ్వరరావు, భరణి, సత్యదేవ, మాథ్యూస్, జి.శ్రీనివాస్, శిరీష, రాజ్యం, రమణ, దుర్గ, గన్నెయ్య తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్ఎంకు సత్కారం


సువర్ణమాల దంపతులను సత్కరిస్తున్న ఎంపీపీ తదితరులు

కడియం: వైద్యారోగ్య శాఖలో ఏఎన్ఎంగా పని చేసి పదవీ విరమణ పొందిన కొంబత్తుల సువర్ణమాల సేవలు అభినందనీయమని ఎంపీపీ వెలుగుబంటి వెంకట సత్యప్రసాద్ అన్నారు. పదవీ విరమణ సందర్భంగా సువర్ణమాల దంపతులను మంగళవారం కడియపులంకలో సన్మానించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి సర్పంచ్ పాటంశెట్టి రాంజీ, ధవళేశ్వరం పీహెచ్‌సీ సీనియర్ వైద్యాధికారి డా.సుధాకర్ తదితరులు మాట్లాడారు. వైస్ ఎంపీపీ పంతం గణపతి, వైద్యాధికారులు ఎస్ జెస్సీ సుప్రియ, జి స్వరూప, ఎం.మణిజ్యోత్స్న, ఎస్ నాగసాయి మౌర్య, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

డెంగీతో ప్రాణాపాయం


సీతానగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

సీతానగరం: డెంగీతో ప్లేట్‌లెట్ల సంఖ్య క్షీణించి, ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందని సీతానగరం పీహెచ్‌సీ డాక్టర్ ఏవీకే చైతన్య అన్నారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా సీతానగరంలో మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. పీహెచ్‌సీ నుంచి పాత పోలీస్ స్టేషన్, బస్టాండ్ సెంటర్, నాలుగు బొమ్మల సెంటర్ మీదుగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ చైతన్య మాట్లాడుతూ డెంగీని అశ్రద్ధ చేస్తే ప్రాణాపాయం కలిగే అవకాశం ఉందన్నారు. దోమల వృద్ధికి కారణమయ్యే ఇంటి లోపల, బయటా నీటి నిల్వలు లేకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. పాత టైర్లు, కొబ్బరి డొక్కుల్లేకుండా చూడాలన్నారు. నీటి, పూల కుండీల్లో మూడు రోజులకు మించి నీటి నిల్వ ఉంచరాదన్నారు. దోమ తెరలు వాడాలని, ప్రతి శుక్రవారం డ్రై డే పాటించాలని చెప్పారు.

కోటి ఆనందాల ధామం

సాయం సంధ్యవేళ.. గోదారి తీరాన.. ప్రకృతి అందాలు తిలకిస్తూ కుటుంబ సమేతంగా గడిపే ఆ క్షణాలు ఎంతో మధురానుభూతులు మిగులుస్తాయి. అత్యాధునిక సౌకర్యాలతో ఆ ఆనందాలనే నిజం చేసేలా నగరపాలక సంస్థ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యాచరణ ప్రణాళిక దాదాపు పూర్తి కావచ్చింది. మరికొద్ది రోజుల్లో ఆధునిక వసతులతో రూపుదిద్దుకున్న కోటిలింగాల ఘాట్ రిక్రియేషన్ స్పాట్ నగర ప్రజలకు అందుబాటులోకి రానుంది.


కోటిలింగాల ఘాట్‌లో నిర్మాణమవుతున్న రిక్రియేషన్ స్పాట్

- నగరంలో రిక్రియేషన్ స్పాట్‌గా కోటిలింగాల ఘాట్
- చకచకా ఏర్పాట్లు చేస్తున్న నగరపాలక సంస్థ
- రూ.1.80 కోట్ల నిధులతో నిర్మాణాలు
- మరికొద్ది రోజుల్లో ప్రారంభోత్సవానికి సిద్ధం

రాజమహేంద్రవరం సిటీ: పర్యాటకులు, సందర్శకులకు ఆహ్లాదాన్ని, ఆనందాన్ని అందించేందుకు మరో వేదిక సిద్ధమవుతోంది. అప్పట్లో రాజమహేంద్రవరం మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ మంజూరు చేసిన రూ.1.80 కోట్ల ఎంపీ ల్యాడ్స్‌తో రిక్రియేషన్ స్పాట్ పేరుతో నగరపాలక సంస్థ స్థానిక కోటిలింగాల ఘాట్ ప్రాంతాన్ని శరవేగంగా అభివృద్ధి చేస్తోంది. తొలుత ఈ రిక్రియేషన్ స్పాట్‌ను స్థానిక పుష్కరఘాట్ సమీపంలోని చిత్రాంగి గెస్ట్‌హౌస్ వద్దనున్న స్థలంలో ఏర్పాటు చేసేందుకు పరిశీలించారు. సాంకేతిక కారణాలు, రైల్వే శాఖ అభ్యంతరాల నేపథ్యంలో దీని స్థానే కోటిలింగాల ఘాట్‌ను ఎంచుకున్నారు. ఈ మేరకు నిర్మాణ పనులు చేపట్టేందుకు నగరపాలక సంస్థ అధికారులు చర్యలు చేపట్టారు. దేశంలో అతిపెద్ద గోదావరి ఘాటుగా పేరొందిన కోటిలింగాల ఘాట్‌లో ఈ రిక్రియేషన్ స్పాట్‌ను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. పర్యాటకులు, సందర్శకులు, నగర ప్రజలు గోదావరి అందాలను తిలకిస్తూ.. ఆనందాన్ని ఆహ్లాదాన్ని పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

అత్యాధునికంగా..

గోదావరి ఒడ్డున వినూత్న తరహాలో అత్యాధునికంగా రెండు కాఫిటేరియాలను నిర్మిస్తున్నారు. కోటిలింగాల ఘాట్‌కు వచ్చే సందర్శకులు గోదావరి ఒడ్డున కూర్చుని, ఆహ్లాదకర వాతావరణంలో గోదావరి అందాలను తిలకించేలా రూపొందిస్తున్నారు. రిక్రియేషన్ స్పాట్‌లో భాగంగా కోటిలింగాల ఘాట్‌లో పది షాపులను కూడా నిర్మిస్తున్నారు. ఘాట్‌కు వచ్చే భక్తులు, పర్యాటకులు, సందర్శకులకు అవసరమైన ఆహారం, శీతల పానీయాలు అందించేందుకు వీలుగా వీటిని ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో ఇప్పటివరకు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అర్బన్ ఫుడ్ ప్లాజా నెలకొల్పారు. దాని తరహాలోనే సందర్శకులకు అవసరమైన ఆహార పదార్థాలను అందించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. షాపుల్లో కొనుగోలు చేసిన ఆహార పదార్థాలను సందర్శకులు గోదావరి చెంతనే కూర్చుని ఆస్వాదించేలా నిర్మాణాలు జరుగుతున్నాయి.

ప్రత్యేక ఏర్పాట్లు

ఘాట్‌కు వచ్చే సందర్శకులు కూర్చునేందుకు అవసరమైన సిట్టింగ్ అరేంజ్‌మెంట్లు ఉన్నాయి. అలాగే ఘాట్‌లో విద్యుద్దీపాలతో ప్రత్యేక అలంకరణ ఏర్పాట్లూ చేస్తున్నారు. నగర ప్రజలకు ఆనందాన్ని అందుబాటులో తెచ్చేందుకు కోటిలింగాలు ఘాట్ వైభవాన్ని పెంచేలా ఈ అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్టు నగరపాలక సంస్థ అధికారులు చెబుతున్నారు. నూతనంగా రూపుదిద్దుకుంటున్న రిక్రియేషన్ స్పాట్ నగర ప్రజలు, పర్యాటకులు, సందర్శకులను ఆకట్టుకుంటుందని అంటున్నారు. ఇది పూర్తయితే నగరంలో మరో నూతన పర్యాటక కేంద్రంగా కోటిలింగాల ఘాట్ మారుతుందనడంలో సందేహం లేదని నగర ప్రజలు చెబుతున్నారు.

కొద్ది రోజుల్లో సిద్ధం



నగరంలో సందర్శకులకు ఆహ్లాదాన్ని అందించేందుకు మరో వేదిక సిద్ధం చేస్తున్నాం. ప్రతిష్టాత్మకమైన కోటిలింగాల ఘాట్‌కు వైభవాన్ని తీసుకొచ్చేందుకు నూతన హంగులతో రిక్రియేషన్ స్పాట్ సిద్ధం చేస్తున్నాం. మాజీ ఎంపీ భరత్‌రామ్ అప్పట్లో రూ.1.80 కోట్ల ఎంపీ నిధులు మంజూరు చేశారు. శరవేగంగా జరుగుతున్న ఈ నిర్మాణాలు కొద్ది రోజుల్లో పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నాం. ఘాట్‌లో సందర్శకుల కోసం పది షాపులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

– దినేష్‌కుమార్, కమిషనర్, నగరపాలక సంస్థ, రాజమహేంద్రవరం


నిర్మాణంలో ఉన్న దుకాణాలు


సందర్శకుల కోసం సిట్టింగ్ ఏర్పాట్లు

మాజీ మంత్రి వేణుకు ప్రముఖుల పరామర్శ

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): మాతృమూర్తి చెల్లుబోయిన సుభద్రమ్మను కోల్పోయిన మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణను మంగళవారం పలువురు ప్రముఖులు పరామర్శించారు. కోటిలింగాల ఘాట్‌లో నిర్వహించిన సుభద్రమ్మ అంత్యక్రియలకు రాజమహేంద్రవరం రూరల్, సిటీ నియోజక వర్గాల నుంచి వైఎస్సార్ సీపీ, వివిధ సంఘాల నేతలు భారీ సంఖ్యలో హాజరయ్యారు. మహాకాళేశ్వరాలయం వ్యవస్థాపక అధ్యక్షుడు పట్టపగలు వెంకటరావు, వివిధ సంఘాల నేతలు నయనాల కృష్ణారావు, కేకే.సంజీవరావు, అశోక్ కుమార్ జైన్, ఏఎస్పీ వి.గోపాలకృష్ణ, విశ్రాంత ఏఎస్పీలు వి.రాజగోపాల్, ఆర్.సత్యానందం, మాజీ కార్పొరేటర్లు ప్రసాదుల హరినాథ్, వాసంశెట్టి గంగాధర్, రాష్ట్ర ఎస్‌ఆర్‌డెక్యాప్ మాజీ డైరెక్టర్ అంగాడి సత్యప్రియ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పెయ్యల రాజేష్, మాజీ సర్పంచ్‌లు పిన్నింటి ఏకబాబు, సాపిరెడ్డి సూరిబాబు, దాసరి శేషగిరి, మాజీ ఎంపీటీసీలు నక్కా శ్యాంబాబు, బుడ్డిగ వీరవెంకటరావు గౌడ్, సొసైటీ మాజీ చైర్‌పర్సన్లు వెలుగుబంటి అచ్యుతరామ్, బొప్పన సుబ్బారావు, చీరా రాజు, తిరుమలశెట్టి శ్రీనివాస్, పార్టీ నాయకులు కొత్తపల్లి శివాజీ, తాటికొండ విష్ణుమూర్తి, చెరుకూరి సత్యనారాయణ, పరిమి దుర్గారావు, పిన్నమరెడ్డి సూర్యచంద్రరావు, షేక్ చాంద్, గాబ్రియేలు, బోడపాటి కుమార్, శివాజీ, దుంపా చంద్రారెడ్డి, పడమటి కామరాజు, చాపారాజా, రాంకీ, అడపా అనిల్, కోడికోట, సీతారామ్ తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

సుబ్రహ్మణ్యేశ్వరునికి అభిషేకాలు

బిక్కవోలు: మండలంలోని బిక్కవోలులో కొలువైన కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం కృత్తికా నక్షత్రం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. అర్చకులు స్వామివారిని అలంకరించి పూజలు చేశారు.

ప్రైవేట్ స్కూళ్లను తనిఖీ చేసిన ఆర్డీఓ

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని ప్రైవేట్ స్కూళ్లను ఆర్డీఓ చైత్రవర్షిణి మంగళవారం తనిఖీ చేశారు. ఉత్తర్వుల మేరకు ఫ్రీ సీట్లలో చేరిన విద్యార్థులకు అందజేస్తున్న విద్యా బోధన విధానాన్ని పరిశీలించారు. స్థానిక లిటిల్ ప్యారడైజ్ స్కూల్‌ను డీఎస్ఈఓ కె.వాసుదేవరావు, ఇతర అధికారులతో కలసి ఆమె ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఉచిత సీట్లలో చేరిన విద్యార్థులకు జరుగుతున్న విద్యా బోధనపై పలు అంశాలను పరిశీలించామన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు చేపట్టినట్టు చెప్పారు. చిన్నారులతో మాట్లాడి వివరాలు సేకరించామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత లక్ష్యంతో ప్రైవేటు స్కూళ్లలో కొన్ని సీట్లను నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలకు తప్పనిసరిగా కేటాయించిందన్నారు. వారికి ఇతర పిల్లలతో సమానంగా విద్యా బోధన ఇవ్వాల్సిన నైతిక, సామాజిక బాధ్యత అందరికీ ఉందని స్పష్టం చేశారు.


దానవాయిపేటలోని ప్రైవేట్ స్కూలును తనిఖీ చేస్తున్న ఆర్డీఓ చైత్రవర్షిణి

వైద్యాధికారులపై కలెక్టర్ ఆగ్రహం

- ప్రభుత్వాస్పత్రి సిబ్బందికి మెమోలు
- హుటాహుటిన జనరేటర్, ఇతర కనెక్షన్ల తొలగింపు

సాక్షి ఇంపాక్ట్

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రిలో హోటల్‌తో పాటు, ఇతరులు వాడుకుంటున్న విద్యుత్ కనెక్షన్లను వైద్యాధికారులు మంగళవారం హుటాహుటిన తొలగించారు. ప్రభుత్వాస్పత్రిలో హోటల్ నిర్వాహకులకు జనరేటర్ కనెక్షన్‌తో పాటు, నిబంధనలకు విరుద్ధంగా హోటల్ నిర్వహిస్తున్న తీరు, ఆస్పత్రిలో కరెంటు బిల్లులు చెల్లించకపోవడంపై 'సాక్షి'లో సోమవారం 'అంతా వారిష్టం' శీర్షికన కథనం ప్రచురితమైన విషయం విదితమే. ఈ నేపథ్యంలో ప్రభుత్వాస్పత్రి అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ లక్ష్మీ సూర్యప్రభ వెంటనే ఇతర ఆస్పత్రి అధికారులు, ఎలక్ట్రీషియన్ సిబ్బందిని పిలిచి వివరణ అడిగారు. వాటిని వెంటనే తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. హోటల్ ప్రాంగణాన్ని నాలుగు దుకాణాలుగా విభజించి, రోగుల కోసం జిరాక్స్, స్టేషనరీ దుకాణాలను అందుబాటులోకి తేవాలని ఆదేశాలు జారీ చేశారు. దాంతో పాటు ఆస్పత్రిని ఆనుకుని ఉన్న జనరిక్ మందుల దుకాణం, వేరే ఇతర మరో మూడు జనరేటర్ కనెక్షన్లను తొలగించారు. దీనిపై ఆస్పత్రి ఎలక్ట్రీషియన్ విభాగం సిబ్బందికి సూపరింటెండెంట్ మెమోలు జారీ చేశారు. ఈ వ్యవహారంపై, తీసుకున్న చర్యలపై సూపరింటెండెంట్ లిఖితపూర్వకంగా కలెక్టర్‌కు తెలిపారు.


ప్రభుత్వాస్పత్రికి అనుసంధానంగా ఉన్న హోటల్, జనరిక్ షాపు, ఇతర వాటికి విద్యుత్ కనెక్షన్లను కట్ చేస్తున్న సిబ్బంది

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఎమ్మెల్యే వాసు

కంబాలచెరువు: నగరంలో ఏ ఒక్క డయేరియా కేసు నమోదు కాకుండా వైద్య, ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక కోటిలింగాలరేవు ప్రాంతంలోని అర్బన్ హెల్త్ సెంటర్ వద్ద ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే వాసు మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో ముందస్తుగా అప్రమత్తమై డయేరియా కేసులు నమోదు కాకుండా కార్యాచరణతో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. జింక్, ఓఆర్ఎస్ అందిస్తున్నట్టు చెప్పారు. డయేరియా నియంత్రణకు ప్రతిఒక్కరూ కాచి, చల్లార్చిన నీటిని తాగాలన్నారు. ఐదేళ్లలోపు చిన్నపిల్లల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ ప్రసన్నలక్ష్మి, నగరపాలక సంస్థ హెల్త్ ఆఫీసర్ వినూత్న, హెల్త్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.


వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు

రోటరీ రివర్ సిటీ అధ్యక్షుడిగా నరసింహారావు

రాజమహేంద్రవరం సిటీ: రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ నూతన అధ్యక్షుడిగా నాళం నరసింహారావు ఎన్నికయ్యారు. మంగళవారం జేఎన్ రోడ్ ఏకేసీ రోటరీ రివర్ సిటీ హాల్‌లో క్లబ్ 2024–25కు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఇంకా కార్యదర్శిగా కనకం చంద్రశేఖరరావు, కోశాధికారిగా నూలి శివమల్లికార్జున, పలువురు కార్యవర్గ సభ్యులు నియమితులయ్యారు. రోటరీ పూర్వ డిస్ట్రిక్ట్ గవర్నర్ లక్కరాజు సత్యనారాయణ నూతన కార్యవర్గంతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మహిళలకు కుట్టు మెషీన్లు, హియరింగ్ ఎయిడ్స్, విద్యార్థులకు పుస్తకాలు, క్రికెట్ బ్యాట్లు, విద్యార్థులకు పారితోషికాలు అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ గవర్నర్ సుంకర నాగేంద్రకిషోర్, నూతన అసిస్టెంట్ గవర్నర్ పీఎస్ఎస్ దొరబాబు, రివర్ సిటీ పూర్వ అధ్యక్షుడు మద్దూరి శివసుబ్బారావు, గాదె కిషోర్, ఇనుమర్తి రామకృష్ణారావు బచ్చు సత్యానందం, బూర్లగడ్డ సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.


ఎన్నికైన నూతన కార్యవర్గమిదే..

15న బహిరంగ వేలం

రాజమహేంద్రవరం సిటీ: పుష్కరాల రేవులోని గోషాయి మఠం, నంది మంటపం, గోదావరి మాత ఆలయాల్లో భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు, రవికలు, చీరెలు ఈ ఏడాది (2024–25) జూలై 26 నుంచి ఏడాది పాటు సేకరించుకునే హక్కులకు బహిరంగ వేలం నిర్వహించనున్నారు. ఈ నెల 15న ఉదయం 10 గంటలకు మఠం కార్యాలయం వద్ద ఈ వేలం జరుగుతుందని మఠం కార్యనిర్వహణాధికారి పి.తారకేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు మఠం కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: అత్యవసర విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా బుధవారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ మంగళవారం తెలిపారు. హౌసింగ్ బోర్డ్ ఏరియా మొత్తం విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

మర్యాద పూర్వకంగా..


కలెక్టర్ ప్రశాంతికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

రాజమహేంద్రవరం రూరల్: కలెక్టరేట్‌లో మంగళవారం కలెక్టర్ పి.ప్రశాంతిని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపారు.

నగదు మాయం

కంబాలచెరువు: ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ బ్యాగులో రూ.14 వేలు మాయమైనట్టు పోలీసు కేసు నమోదైంది. గూడ్సుగేట్ ప్రాంతానికి చెందిన జయశ్రీ మేరీ మిలటరీలో ఉద్యోగం చేస్తోంది. సెలవుపై ఇంటికి వచ్చిన ఆమె మంగళవారం ఏటీఎంలో నగదు డ్రా చేసి, ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి తిరిగి ఇంటికి బయలుదేరింది. ఆటో దిగి చూసుకునేసరికి బ్యాగులో నగదు మాయమైంది. ఈ మేరకు ఆమె రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జాతీయ యోగా పోటీలకు రాజమహేంద్రవరం విద్యార్థులు



విజేతలతో వ్యాయామ ఉపాధ్యాయులు

రాజమహేంద్రవరం రూరల్: హైదరాబాద్ షేక్‌పేటలో ఇటీవల జరిగిన ఐసీఎస్ఈ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రాంతీయ స్థాయి యోగా పోటీల్లో రాజమహేంద్రవరానికి చెందిన విద్యార్థులు ప్రతిభను చాటారు. అండర్–14 బాలికల విభాగంలో జి.సాన్విక ప్రథమ, బి.దీప్తిక తృతీయ, అండర్–17 బాలుర విభాగంలో కార్తీక్ రామ్‌గుప్తా ద్వితీయ, ఎం.యశ్వంత్ తృతీయ, అండర్–19 బాలుర విభాగంలో అరుణ్‌కుమార్ ప్రథమ, అర్జున్ ఆదిత్య తృతీయ స్థానాలు సాధించారు. వీరు త్వరలో కోల్‌కతాలో జరిగే జాతీయ స్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారు. వీరు రాజమహేంద్రవరంలోని ది ఫ్యూచర్ కిడ్స్‌లో చదువుతున్నారు. విజేతలను, వ్యాయామ ఉపాధ్యాయులను పాఠశాల డైరెక్టర్ యేలేటి రవిబాబు, చైర్‌పర్సన్ విజయ యేలేటి, సీఈఓ మహశ్వి యేలేటి, డీన్ హర్షిణి, ప్రిన్సిపాల్ శేషగిరిధర్, వైస్ ప్రిన్సిపాళ్లు సైదాబాను, శ్రీవల్లి అభినందించారు.

నిర్లక్ష్యపు క్రీనీడ

- ముంపునకు గురవుతున్న రైల్వే క్రీడా మైదానం
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజమహేంద్రవరం రూరల్: రైల్వే గ్రౌండ్. ఈ క్రీడా మైదానం పేరు వింటే.. ఒకప్పుడు క్రీడల హడావిడి, క్రికెట్ మ్యాచ్‌ల సందడి, కేరింతలు కొడుతూ ఆటలాడే పిల్లలు.. అంతా సరదాగా ఉండేది. సెలవు రోజొస్తే చాలు.. చుట్టుపక్కల ప్రాంతాల పిల్లలు, యువకులు ఇక్కడకు చేరుకుని రోజంతా ఆటలాడుతూ కాలం వెళ్లదీసేవారు. కాలక్రమేణా ఈ క్రీడా మైదానం నిర్లక్ష్యానికి గురవుతూ వస్తోంది. మునుపటి హడావిడి కానీ, ఆటల సందడి కానీ ఇప్పుడు కానరావడం లేదు.

ఒకప్పుడు రైల్వే క్రీడా మైదానంలో నిత్యం క్రికెట్ మ్యాచ్‌లతో పాటు, పలు క్రీడా పోటీలు నిర్వహిస్తుండేవారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఈ క్రీడా మైదానం ఇప్పుడు క్రీడాకారులు సాధన చేసుకునేందుకు వీల్లేకుండా పోతోంది. వర్షం వస్తే చాలు కొన్నిచోట్ల మైదానం నీట మునుగుతోంది. దీంతో క్రీడాకారులతో పాటు, వాకర్స్‌కూ ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

అభివృద్ధి చేయాలి

రైల్వే క్రీడా మైదానంలో క్రికెట్‌తో పాటు, అనేక గేమ్స్ జరుగుతుండేవి. ప్రస్తుతం క్రీడా మైదానం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. వర్షం వస్తే చాలు మైదానం ఓవైపు మునిగిపోతోంది. ఇప్పటికైనా రైల్వే అధికారులు, రాజమహేంద్రవరం ఎంపీ చొరవ తీసుకుని ఈ క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాలి.

– వై.వెంకటరావు, వాకర్, హుకుంపేట

మైదానం పరిస్థితి

రాజమహేంద్రవరంలో 17వ డివిజన్ తూర్పు రైల్వే స్టేషన్ పరిధిలో ఐఎల్‌టీడీ కంపెనీ సమీపంలో రైల్వే క్రీడా మైదానం ఉంది. ఈ మైదానానికి నిత్యం క్రీడాకారులతో పాటు, వాకర్లు వందలాది మంది వస్తుంటారు. గతంలో క్రీడా మైదానం క్రికెట్‌తో పాటు, వివిధ క్రీడా పోటీలకు ఎంతో అనువుగా ఉండేది. క్రికెట్ టోర్నమెంట్లతో పాటు, స్కూల్ గేమ్స్ నిర్వహిస్తుండేవారు. రైల్వే స్కూల్ ఉన్న సమయంలో విద్యార్థులను ఈ మైదానంలోనే ఆడిస్తుండేవారు. మూడేళ్ల క్రితం రైల్వే స్కూలు మూతపడింది. క్రీడా మైదానాన్ని బొమ్మూరు, హుకుంపేట, బాలాజీపేట, శంభూనగర్, ఐఎల్‌టీడీ ప్రాంత వాసులు వినియోగించుకుంటున్నారు. రన్నింగ్‌తో పాటు, క్రికెట్, షటిల్ ఆడుతుంటారు. వాకర్లు సైతం ఈ మైదానాన్ని వినియోగిస్తుంటారు.


రైల్వే గ్రౌండ్‌లో నిలబడిన వర్షపు నీరు

వర్షం వస్తే మునకే..

రైల్వే క్రీడా మైదానం వర్షం వస్తే చాలు కొన్నిచోట్ల ముంపు నీటిలో మునిగిపోతుంది. దీంతో క్రీడాకారులకు రన్నింగ్ చేసుకోవడానికి వీల్లేకుండా పోతోంది. అంతేకాకుండా మైదానమంతా బురదమయంగా మారిపోతుంది. ఈ మైదానం విషయమై రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని, ముంపునకు గురికాకుండా చర్యలు చేపట్టాలని క్రీడాకారులు కోరుతున్నారు.